

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి  సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఎందుకో? ఏమో?

**నెలరోజుల ఉత్తర** భారత దేశ యాత్ర ముగించుకుని ఇంటికి వచ్చిన నాకు పార్వతి కొడుకు వేరు కాపురం పెట్టాడన్న వార్త షాక్‌గా అనిపించింది.

మా కాలనీలో ఏ పిల్లలకి బుద్ధిచెప్పాలన్నా, మంచిమాటలు చెప్పాలన్నా గౌతమ్ ప్రస్తావన రాకుండా ఉండదు. మంచితనం, చదువు, పెద్దవాళ్ళమీద గౌరవం, వినయంలాంటి గుణాలన్నీ మూర్తీభవించిన గౌతమ్ పార్వతికి రెండో గుండె అతను, పార్వతి అమ్మా కొడుకుల్లా కంటే స్నేహితుల్లా ఉంటారు, ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటారు. పాత సినిమాలు కలిసి చూస్తారు. కలిసి వంట చేస్తారు. శివరావుగారు వీళ్ళలో పెద్దగా చేరకపోయినా గౌతమ్‌కి తండ్రంటే ప్రాణం. ఆయన వంటరిగా ఫీలవుతాడని ఏవో ప్రశ్నలు వేసి ఆయన్ని తమ సంభాషణలోకి లాగుతాడు. అప్పుడప్పుడూ ముగ్గురూ కలిసి ఏదో ఒక ప్రాంతానికి పర్యాటకానికి వెళ్తారు.

"ఉన్న ఒక్క కొడుకు వెధవైతే ఏం చేయగలిగేదాన్ని చెప్పు? దేవుడు ఏ జన్మలోనో చేసిన పూజకి ప్రతిఫలం ఇచ్చాడు" పార్వతి తరచూ నాతో తృప్తిగా చెప్తూండేది.

మా ఊరి కాలేజ్‌లోనే మెడిసిన్ చదివిన గౌతమ్, పి.జికి వైజాగ్ వెళ్ళాలని అక్కడితో చదువు ఆపేసి, చిన్న క్లినిక్ తెరిచాడు. ఈ రోజుల్లో ఉత్త యం.బి.బి.ఎస్‌కి విలువలేదు, పిజి చేయమని ఎంతమంది చెప్పినా వినలేదు. చివరికి శివరావుగారు రిటైరయ్యాక, పార్వతి రెండేళ్ళు వైజాగ్‌లో కాపురం పెడదామని గౌతమ్‌ని ఒప్పించి పిజిలో చేర్పించింది. తల్లితండ్రుల మీద అంత ప్రేమున్న గౌతమ్ వేరు కాపురం పెట్టడం ఏమిటి? ఎన్నో డాక్టర్ సంబంధాలు వచ్చినా ఇంట్లో తల్లికి చేదోడుగా ఉండాలని బి.కామ్ చదివిన వసుధని పెళ్ళిచేసుకున్నాడు. ఆ అమ్మాయి కూడా మంచిపిల్ల. 'అత్తయ్యా' అంటూ పార్వతి వెనకే తిరుగుతూంటుంది. మరి ఈ నెలలో అంత తీవ్రనిర్ణయం తీసుకునే పరిస్థితులు ఏమొచ్చాయో నాకు అర్థంకాలేదు.

"పిన్నిగారూ! యాత్రలు బాగా సాగాయా?" ఎదురింటి నాగరాణి అడిగింది.

"బాగానే సాగింది రాణీ" సమాధానం ఇచ్చాను.

నాకు ఈ అమ్మాయంటే చిరాకు. ఊళ్ళో అందరి విషయం కావాలి. నాగరాణికాదు. గాసిప్స్ రాణి.

ఆమె చటుక్కున ఇంటిగేట్ మూసి, క్షణంలో మా ఇంటికొచ్చింది. కళ్ళు పెద్దవి చేసి గుసగుసగా చెప్పింది.

"మీకీ విషయం తెలుసా? గౌతమ్ వేరు కాపురం పెట్టాడు"

"ఆఁ మా కోడలు చెప్పింది" పొడిగా చెప్పాను.

"పాపం మీ ఫ్రెండు 'మా వసుధకి పేరుకి తగ్గట్లే భూదేవంత సహనం' అంటూ కోడల్ని తెగ మెచ్చుకునేది. ఇలా అమాయకపు వేషాలు వేసేవాళ్ళే కొంపముంచేవాళ్ళు. మొగుడికి ఏం నూరిపోసిందో లేచ్చక్కా పోయాడు. పాపం ఆవిడ కరివేపాకు కోసుకోడానికి కూడా బయటకి రావడంలేదు. ఆయనేమో మంచమెక్కాడట."

చెప్పాల్సిందంతా చెప్పి నాగరాణి మళ్ళీ వాళ్ళ గేట్‌లోకి వెళ్ళిపోయింది. కొంతమంది ఎదుటివాళ్ళ బాధలని ఎంత ఎంజాయ్ చేస్తారో కదా అనిపించింది. వసుధ మీద నాగరాణికి అంత అక్కసు ఎందుకో కూడా తెలీలేదు.

మధ్యాహ్నం భోజనాలు అయ్యాక పార్వతి ఇంటికి వెళ్ళాను. నిజానికి మా పక్కిల్లే అయినా, ఆ నాలుగు అడుగులు నాలుగుమైళ్ళలా అనిపించింది. ఎలా పరామర్శించాలో కూడా అర్థం కాలేదు. కానీ వెళ్ళకుండా మనసాగలేదు.

తలుపు తీసిన పార్వతిని చూసి ఆశ్చర్యపోయాను. వెడల్పాటి మొహం చిన్నదైపోయి, కళ్ళకింద నల్లచారలు అలముకున్నాయి.

"రా, కూర్చో. ఎప్పుడొచ్చావు యాత్రలనించి?" అడిగింది.

"ఉదయమే రాగానే కోడలు చెప్పింది."

"హుం" పార్వతి నిట్టూర్చింది.

"గౌతమ్ ఇలా ఎందుకు చేసాడో తెలీదు విమలా. పొద్దున్నే ఇడ్లీ తింటున్నవాడు పళ్ళెం ముందునుంచి లేచాడు. కోడల్ని 'సామాను సర్దు' అన్నాడు. ఆ పిల్ల అర్థంకాక అయోమయంగా చూస్తుంటే రెక్క పట్టి గదిలోకి లాక్కెళ్ళాడు. అరగంటలో ఇద్దరి సామాన్లు సర్దికారులో పెట్టి వసుధని ఎక్కించుకుని ఉన్న పళంగా వెళ్ళిపోయాడు. నాకు అర్థంకాక 'ఏమైందిరా?' అని అడుగుతూనే ఉన్నాను. నా మాట వినలేదు. పట్టించుకోలేదు. నా అరుపులకి, ఏడుపుకి చుట్టుపక్కలంతా తొంగిచూడటంతో నోర్మూసుకున్నాను కానీ వాడు నా వైపుగానీ, వాళ్ళ నాన్నవైపు కానీ చూడకుండా వెళ్ళిపోయాడు. ఉన్నట్లుండి వాడికి అంత ఆవేశం ఎందుకొచ్చిందో తెలీదు. ఆయన మంచం దిగడంలేదు. వీధి మొహం చూడడం లేదు. నేనే ఉండబట్టలేక హాస్పిటల్‌కి వెళ్ళాను. మామూలుగానే మాట్లాడాడు. 'ఇంట్లోంచి ఎందుకు వచ్చేసావురా' అంటే 'దయచేసి ఆ ప్రస్థావన ఎత్తొద్దమ్మా' అన్నాడు అంతే. మళ్ళీ మాట్లాడితే ఆ మాటలు కూడా ఉండవని ఇక ఆ ప్రసక్తి ఎత్తలేదు. వసుధని చూడాలంటే కాంపౌడర్‌కిచ్చి పంపించాడు. హాస్పిటల్ పక్కనే ఓ చిన్న ఇల్లు. నన్ను చూసి 'అత్తయ్యా' అని ఒకటే ఏడుపు. నేనూ ఏడుపు. కానీ మేమేం చేయగలం?" పార్వతి దీర్ఘంగా నిట్టూర్చింది.

నాకేం మాట్లాడాలో తోచలేదు.

"వాళ్ళ నాన్నకి బాలేదని చెప్పాను. వచ్చి చూస్తాడనుకున్నాను. మందులిచ్చి ఎలా వాడాలో చెప్పాడు. వారం తర్వాత కాంపౌండర్ వచ్చి చూసి అంతా బానే వుందని చెప్పాడు. ఆ కాంపౌండర్‌తోనే నెలకి సరిపడా డబ్బిచ్చి పంపాడు వాడి మనసెందుకో బాధపడింది. నెమ్మది మీదట అదే సర్దుకుంటుందనే ఆశతో బతుకుతున్నాను" పార్వతి ఏడ్చేసింది.

నేను కొద్దిసేపు ఓదార్చి, శివరావుగారిని పరామర్శించి ఇంటికి వచ్చేసాను. ఆసక్తిగా నావైపు చూసిన కోడలికి 'పెద్ద విశేషాలేం లేవు. మీరు చెప్పిందే చెప్పింద'ని చెప్పాను.

మా వీధిలోని వారందరికీ గౌతమ్ ఉదంతం విపరీతమైన ఆసక్తిని కలిగించింది. దాదాపు ఇంటికొకరు చొప్పున ఏదో రోగం సృష్టించుకుని హాస్పిటల్‌కి వెళ్ళి గౌతమ్‌తో వాళ్ళమ్మా, నాన్న దీనస్థితిని గురించి వర్ణించారని కోడలు చెప్పింది.

పార్వతి వెళ్ళి కలిసిన విషయం వీళ్ళెవరికీ తెలియదని అర్థమైంది.

"అంతా వసుధదే తప్పు అంటున్నారు అత్తయ్య. ఏవో చెప్పి అతని మనసు విరిచేసిందిట" చెప్పింది.

"అలాగా" చెప్పి బట్టలు సర్దుకోసాగాను. ఇక మళ్ళీ తను నన్ను మాట్లాడించలేదు.

వారం తర్వాత తెలిసినవాళ్ళ ఇంటికివెళ్ళి వస్తూంటే వసుధ కనిపించింది. కూరలబండి దగ్గర కూరలు కొంటోంది. నన్ను చూడగానే 'ఆంటీ' అంటూ దగ్గరికి వచ్చింది.

"మీరు ఇక్కడే ఉంటున్నారా?" ఆప్యాయంగా అడిగాను.

"అవును రండి." నా చెయ్యి పట్టుకుని వాళ్ళింటికి తీసుకెళ్ళింది.

"ఆంటీ కాఫీ తాగుతారా?" నేను కూర్చున్నాక అడిగింది.

"వద్దు. ఇప్పుడే తాగాను. నువ్వూ కూర్చో వసుధ. ఏమిటంత చిక్కిపోయావు? మెడ ఎముకలు కనపడుతున్నాయి."

వసుధ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మా ఇంటి గొడవ మీకు తెలుసుగా ఆంటీ. అంతా తప్పునాదే అంటున్నారు. నిజమే. తప్పు నాదేనేమో? బయటకి వెళితే తెలిసినవాళ్ళు మొహం మీదే అడుగుతున్నారు. మొన్న మా అమ్మా నాన్నా వచ్చి తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. నేను వాళ్ళ పెంపకానికే అవమానంట. తల్లీకొడుకులని వేరుచేసిన పాపం ఊరికేపోదుట. అబ్బ! ఇంకా ఎన్ని మాటలో" భోరుమంది.

"జరిగినదాంట్లో నీ తప్పేం లేదని పార్వతి నాతో అంది. నువ్వేం బాధ పడకు" ఓదార్చాను.

"నా తప్పుకూడా ఉందాంటీ" వసుధ ఓ నిమిషం ఆలోచించి చెప్పసాగింది.

"ఇది మీ ఒక్కరికే చెప్తున్నానాంటీ. మా అమ్మకి కూడా చెప్పలేదు. మా పెళ్ళయి వెళ్ళాక ముందు ఉమ్మడి కుటుంబం, ఏ సమస్యలు వస్తాయో అని బాగా భయపడ్డాను. కానీ మా ఇంట్లో నేను చాలా త్వరగా ఇమిడిపోయాను. గౌతమ్ చాలా మంచివాడు. ఈ కాలంలో పుట్టాల్సినవాడు కాదు. పాత సినిమాలు, పాతపాటలు అంటే విపరీతమైన ఇష్టం. భావకుడు. తల్లితండ్రులని అమితంగా ప్రేమిస్తాడు. నన్నుకూడా. అంతా బావుంది అనుకుంటుంటే ఒక రోజు.." వసుధ ఓ క్షణం తటపటాయించి మళ్ళీ చెప్పడం ఆరంభించింది.

"స్నానం చేస్తున్న నన్ను ఎవరో చూస్తున్నట్లు అనిపించసాగింది. అప్పటికే బాత్‌రూం గోడలు వెదికాను. ఎక్కడా ఏ రంధ్రంలేదు. కానీ నాకు ఆ ఫీలింగ్ పోలేదు. గౌతమ్‌కి చెప్పాను. అనుమానం అని కొట్టిపారేసారు. మీకు తెలుసుగా. మాది పాత ఇల్లు. అటాచ్డ్ బాత్ రూంలేదు. బాత్‌రూంకి అవతల మొక్కలు. తర్వాత గేటు ఉంటాయి. బయట రోడ్డుమీద పోయేవారు మాటలు కూడా వినిపిస్తూంటాయి. అటువైపు గోడ లేకపోతే వీధిలో ఉన్నట్లే. ఆ కాంప్లెక్స్‌తో నేను అలా భ్రమపడుతున్నానని గౌతమ్ అన్నాడు. ఐనా నేను తెల్లారుఝామునే మసక వెలుగులో లైట్ లేకుండా స్నానం చేయసాగాను. అలాగే రాత్రిపూట పడుకోబోయే ముందు చీకట్లో తడుముకుంటూ స్నానం చేసేదాన్ని. ఆ విషయం గౌతమ్‌కి తెలియదు"

వసుధ మొహం సిగ్గుతో ఎర్రబడింది. తమాయించుకుని చెప్పింది.

"కొత్తగా మా పడక గదిలో ఏకాంతంగా ఉన్నప్పుడు ఎవరో చూస్తున్న ఫీలింగ్ కలగసాగింది. గౌతమ్‌తో చెపితే హారర్ సినిమాలు చూడొద్దని జోక్ చేసారు. కానీ నేను లైట్ ఉంటే తనని దగ్గరకి రానివ్వనని చెప్పాను. తనకి నీలం రంగు వెలుగు ఇష్టం" వసుధ సిగ్గుతో తల దించుకుంది.

"పర్లేదు చెప్పు. మీ అమ్మలాంటి దాన్ని" చెప్పాను.

"ఆ రాత్రి ఆయన నేను వద్దన్నా నీలం రంగు బెడ్‌లైట్ వేసారు. నేను సిగ్గుతో కళ్ళు మూసుకుంటే, 'ఆ రెప్పలు ఆర్పకు, అటు ఇటు కదలకు. ఒక్క క్షణం' అని పాట పాడారు. నేను ససేమిరా ఒప్పుకోకపోతే దీపం ఆర్పేసారు. ఆ మర్నాడు, ఆ దురదృష్టపు రోజున ఆయన హాస్పిటల్‌కి వెళ్ళడానికి తయారై బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నారు. అత్తయ్య ఆయన పక్కన కూర్చుని ఇడ్లీలు వడ్డిస్తూంటే నేను కిచెన్‌లో కాఫీ కలుపుతున్నాను. మామగారు తోటకూర కోస్తానని బయట మొక్కల్లోకి వెళ్ళారు. నేను కాఫీ కప్పు తీసుకొచ్చి టేబుల్ మీద ఉంచాను. అదే సమయంలో.." వసుధ తటపటాయిస్తూ ఆగింది.

నేను కుతూహలంగా చూసాను.

"మామగారు బయట తోటకూర కోస్తూ 'ఆ రెప్పలు ఆర్పకు అటూ ఇటూ కదలకు..' అని కూనిరాగం తీస్తున్నారు. గౌతమ్ చేతిలోని ఇడ్లీ ముక్క కిందపడిపోయింది. అతని మొహం పాలిపోయింది. వెంటనే తెప్పరిల్లి నా వైపు తిరిగి 'సామాను సర్దు' అన్నాడు. నాకు అర్థంకాలేదు. రెక్కపట్టుకుని గదిలోకి ఈడ్చుకెళ్ళి 'ఈ ఇంటికి మనం మళ్ళీ రాం. నీ సామానంతా పదినిమిషాల్లో సర్దాలి. క్విక్' అని అరిచాడు. అత్తయ్యకి ఏం జరిగిందో అర్థంకాక 'ఏమిట్రా?' అని ఆదుర్దాగా అడుగుతున్నారు. ఆయన సమాధానం చెప్పలేదు. నేను గబగబా మా ఇద్దరి బట్టలు, వస్తువులు సర్దేసాను. పెట్టెల్లో పట్టనివాటిని మూటకట్టి డిక్కీలో పడేసాడు. వాళ్ళ అమ్మ ఏడుస్తున్నా నన్ను కార్లోపడేసి హాస్పిటల్‌కి తీసుకెళ్ళి కూర్చోపెట్టాడు. సాయంత్రానికి ఈ ఇంట్లో చేరాం."

నేను నిశ్చేష్టురాలినయ్యాను.

"అత్తయ్య పాపం అకారణంగా శిక్ష అనుభవిస్తున్నారు. 'ఏమైందో నువ్వయినా చెప్పు' అంటారు. నేనేం చెప్పను? ప్రాణంగా పెంచుకున్న కొడుకు దూరమయ్యాడని ఆవిడ బాధపడుతున్నారు. నామూలంగా ఇదంతా జరిగిందని నేను బాధపడుతున్నాను. పైపెచ్చు నాకు ఊళ్ళో వాళ్ళ మాటలు కూడా"

"దీనికి పరిష్కారం ఏమిటి?" గొణిగాను.

"ఆయన ఉన్నంతవరకూ ఇంతేనేమో" వసుధ నిరాశగా చెప్పింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments